క్లుప్తంగా

అసైన్‌మెంట్ భూములు పేదలకు ఇవ్వండి



జేసీతో చర్చిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదిత అసైన్‌మెంట్ జాబితాను వెంటనే ఆమోదించి, పేదలకు పంపిణీ చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌ను కోరారు. శనివారం నెల్లూరులో జాయింట్ కలెక్టర్‌ను రాజారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట తనయుడు అభినవ్‌రెడ్డి కూడా ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్



కంటి అద్దాల పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

కలిగిరి: మండలంలోని తెల్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 503 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులను పంపిణీ చేశారు. మొదటి విడతలో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు గీతారెడ్డి, మస్తాన్‌బాషా, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, సర్పంచ్ మారేళ్ల దొరసానమ్మ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మారేళ్ల పద్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు నేతల సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అల్లూరు: తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.దుర్గేశ్వర్‌రావును శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, పట్టణ అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి, రూరల్ అధ్యక్షుడు బీద రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ సురేంద్ర, నాయకులు చెంతాటి కరుణాకర్, ఉపేందర్‌రెడ్డి, నరసింహారావ్, పి విజయ్, మునిరాజ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా మస్తానయ్య బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కొండాపురం: తహసీల్దార్‌గా పి.మస్తానయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల నేపథ్యంలో గుంటూరు జిల్లా సత్తెనపల్లి నుంచి ఇక్కడికి వచ్చారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న డీటీ శ్రీనివాసరావు దుత్తలూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

కంప్యూటర్ బహూకరణ



దాత అంకిరెడ్డితో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు

వింజమూరు(ఉదయగిరి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ వింజమూరు ప్రాంతీయ కార్యాలయానికి దాదిబత్తిన అంకిరెడ్డి కంప్యూటర్‌ను శుక్రవారం బహూకరించారు. ఉపాధ్యాయ ప్రాంతీయ కార్యాలయంలో సేవలందించేందుకు ఈ కంప్యూటర్ ఉపయోగపడుతుందని ఆ శాఖ మండల అధ్యక్షుడు పి.కొండారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఆర్ జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ బొందల రఘురామిరెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు మల్లికార్జున, జి.నారాయణ, ఎన్.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధిదారులే జగనన్న సైనికులు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- రూ.2.91 కోట్లతో నిర్మించిన రోడ్డు ప్రారంభం
- సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పాలసేకరణ భవనం ప్రజలకు అంకితం



వెన్నవాడలో లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారంతా రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సైనికుల్లా పనిచేసి మరోసారి అఖండ విజయం చేకూరుస్తారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని వెన్నవాడలో శుక్రవారం విజయీభవ యాత్ర నిర్వహించారు. తొలుత 67వ నంబరు జాతీయ రహదారి నుంచి డీసీపల్లి వద్ద వెన్నవాడకు రూ.2.91 కోట్లతో నిర్మించిన నూతన రోడ్డును ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం వెన్నవాడలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనం, రూ.20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.17.67 లక్షలతో నిర్మించిన పాలసేకరణ భవనం (ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ సెంటర్), రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన సైడ్ కాలువల నిర్మాణాలను ఎమ్మెల్యే ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. తొలుత గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి నాయకులు, ప్రజలు మేళతాళాలు, బాణసంచా సందడితో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో, ప్రతి కుటుంబంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. అతి చిన్న గ్రామమైన వెన్నవాడలో సైతం రూ.7.9 కోట్ల నిధులు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించారన్నారు. మునుపెన్నడూ లేని అభివృద్ధిని, సంక్షేమాన్ని తమ కళ్లతో ప్రజలు జగనన్న ప్రభుత్వ హయాంలో చూశారన్నారు. వివిధ రకాల రెవెన్యూ సమస్యలు పరిష్కరించి వందల మంది వెన్నవాడ రైతులకు మేలు చేకూర్చారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మరో రూ.20 లక్షల అభివృద్ధిని చేశామన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అనేక అవరోధాలను ఎదుర్కొని ప్రజల ఆశీర్వాదంతో గత ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలను జగనన్నకు ప్రజలు అందించారని, రెండు నెలల్లో జరగనున్న ఎన్నికల్లో ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు పొందిన వారంతా 175కి 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి,



వెన్నవాడలో రైతు భరోసా కేంద్రంలో రైతులతో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మాజీ జెడ్పీటీసీ డాక్టర్ చిల్లూరు ఆదిశేషయ్య, సర్పంచ్ జగన్నాథం ఆదిలక్ష్మమ్మ, పడకండ్ల సర్పంచ్ మాముడూరు నరసింహులు, ఎంపీటీసీ ప్రమీల, సొసైటీ అధ్యక్షుడు కొల్లి శ్రీహరి నాయుడు, మాజీ అధ్యక్షుడు పర్వతరెడ్డి బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దిశించర్ల ప్రసాద్, జగన్నాథం ప్రసాద్, రాజగోపాల్ నాయుడు, రేవూరు విజయ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ఆత్మకూరురూరల్: కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రూ. లక్ష తన సొంత నిధులను ఆర్థిక సాయంగా అందజేశారు. మండలంలోని వెన్నవాడ గ్రామానికి చెందిన వెలిచర్ల లాస్య, నేహశ్రీ పరిస్థితిని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించారు. శుక్రవారం వెన్నవాడలో విజయీభవ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆ చిన్నారులకు చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందించారు.



చిన్నారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం-కలిగిరి రోడ్డుకు భూమి పూజ

ఉదయగిరి: సంగం-కలిగిరి రోడ్డులో హసనాపురం నుంచి పాతనాపురం వరకు 9 కి.మీ. మేర రోడ్డు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో మేకపాటి కుటుంబం సొంత నిధులతో రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. శనివారం ఉదయం 10 గంటలకు ఈ రోడ్డు పనులకు ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజల ప్రయాణ ఇక్కట్లు తీరేలా చర్యలు చేపడుతున్నారు.

అటవీశాఖ విజిలెన్స్ విచారణ

కావలి: నెల్లూరు, చిత్తూరు జిల్లాలోని అటవీశాఖకు చెందిన భూముల్లో జామాయిల్ చెట్ల పెంపకం వ్యవహారంలో అక్రమాలు జరిగాయని రైతు సంఘం నాయకులు చేసిన ఫిర్యాదు మేరకు అటవీశాఖ విజిలెన్స్ అధికారి రవిశంకర్‌వర్మ శుక్రవారం కావలిలో విచారణ జరిపారు. ఫిర్యాదుదారులను పిలిపించి అక్రమాలకు సంబంధించిన ఆధారాలు అడిగితే వారు ఇవ్వలేదన్నారు. అయినప్పటికీ తాము శాఖా పరంగా విచారణ జరుగుతున్నామని, ఎక్కడా తప్పులు జరిగినట్లు ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదన్నారు.

తపాలా బీమా అందజేత



తపాలా బీమా మొత్తాన్ని అందజేస్తున్న ఏఎస్‌పీ అహమ్మద్ హుస్సేన్

ఆత్మకూరురూరల్: రెండేళ్ల క్రితం దురదృష్టవశాత్తు మరణించిన అనిల్‌కుమార్‌రెడ్డికి సంబంధించి రూ.11 లక్షల జీవిత బీమా మొత్తాన్ని అతని తండ్రి తిరుపతిరెడ్డికి శుక్రవారం ఆత్మకూరు తపాలా శాఖ ఏఎస్‌పీ అహమ్మద్ హుస్సేన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

వరికుంటపాడు: మండలంలోని విరువూరు, తోటల చెరువుపల్లి గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి తర్వాత గుర్తు తెలియని దొంగలు సంచరించినట్లు ఆయా గ్రామస్తులు తెలిపారు. మండలంలోని విరువూరు గ్రామదేవత పోలేరమ్మ ఆలయ తలుపులు ధ్వంసం చేసి హుండీని ఎత్తుకెళ్లారు. తోటలచెరువుపల్లిలోని వీరభద్రస్వామి గుడిలో ప్రవేశించి గర్భగుడి తలుపులు ధ్వంసం చేసేందుకు ప్రయత్నించి విఫలమవడంతో వెనుదిరిగి వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. చోరీ విషయమై పోలీసులకు తెలియడంతో ఎస్సై కె.తిరుపతయ్య తన సిబ్బందితో ఆయా గ్రామాలకు వెళ్లి పరిశీలించారు.



గుడి తలుపులు తెరిచి హుండీ తీసుకెళ్లిన పోలేరమ్మ ఆలయం

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా



మాట్లాడుతున్న తహసీల్దారు నరసింహారావు

సోమశిల: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులపై తహసీల్దారు నరసింహారావు ఆరా తీశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులు, ఎన్నికల కోడ్ వచ్చే లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్నపై హర్షం

ఆత్మకూరు: భారత మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న బిరుదును ప్రకటించడం హర్షణీయమని అది ఆంధ్రులు అందరికీ గర్వకారణమని ఏపీ అర్చక, పురోహిత సంఘం అధ్యక్షుడు, ఏపీ సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆత్మకూరు డివిజన్ అధ్యక్షుడు మేక్లచెరువు శివకుమార్ శర్మ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. తెలుగు వారిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పీవీ నరసింహారావు ఐదేళ్ల పాటు దేశ ప్రధానిగా, గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా విశేష సేవలు అందించారని కొనియాడారు. దేశంలో ఆర్థిక సరళీకరణ విధానానికి ద్వారాలు తెరిచిన ఆర్థిక నిపుణుడు పీవీ నరసింహారావు అని పేర్కొన్నారు. ఆయనకు భారతరత్న బిరుదు అంకితం చేయడం సంతోషదాయకమని అన్నారు. ఆయన వెంట సంఘం సభ్యులు మురళీ కృష్ణమాచార్యులు, అపర్ణ, తదితరులు ఉన్నారు.

పొగాకు తోటల్లో మల్లె తొలగించాలి



పొగాకు క్షేత్రంలో పరిశీలిస్తున్న రైతు క్షేత్రమిత్ర బృందం

మర్రిపాడు: పొగాకు తోటల్లో మల్లె ఎక్కువగా ఉందని, పూత వచ్చే ముందే మల్లెను తీసివేసి కాల్చి పూడ్చి వేయాలని రైతు క్షేత్ర మిత్ర బృందం సూచించింది. పొగాకు బోర్డు అధికారులు, కంపెనీ ప్రతినిధులతో కూడిన రైతు క్షేత్రమిత్ర బృందం శుక్రవారం డీసీపల్లి, గండ్లవీడు, గుండెమడకల, యర్రబల్లి గ్రామాల్లో పొగాకు తోటలు, బ్యారెన్లను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. పొగాకు పంటలో సీటీఆర్‌ఐ సూచించిన మందులను, మోతాదు వరకే వాడాలని, ఎక్కువగా వాడడం వల్ల పురుగు మందుల అవశేషాల పొగాకును కంపెనీలు కొనుగోలు తిరస్కరిస్తాయన్నారు. ఆకు రెల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే రెల్చాలని, బ్యారెన్‌లో కర్రలు అధికంగా పెట్టవద్దని సూచించారు. ప్రతి బ్యారెన్‌కు క్యూరోమీటర్ ఉపయోగించాలని, దీని వల్ల అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ పొగాకు నూరను బయట అమ్మిన లేదా కొనిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పొగాకు బోర్డు చట్ట ప్రకారం రైతులు పొగాకు నాటడం డిసెంబర్ లోపు పూర్తి చేయాలన్నారు. జనవరి నుంచి వేస్తే పొగాకు నాణ్యత చాలా తగ్గుతుందని, దాని వల్ల పొగాకు మార్కెట్‌పై ప్రభావం చూపుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు ఎస్‌జీఓ సిద్ధరాజు, ఐటీసీ ప్రతినిధి దశరథరామిరెడ్డి, జీపీఐ ప్రతినిధి శ్రీనివాసరావు, పీఎస్ఎస్ ప్రతినిధి రామాంజనేయులు, ఏఓఐ ప్రతినిధి వెంకటేశ్వర్లు, ఫీల్డ్ ఆఫీసర్ ఆదర్శ్ జగన్నాథ్, పొగాకు బోర్డు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాలకు దూరం

- విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆత్మకూరు: విద్యార్థులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచుకుని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని రవాణా శాఖ అధికారి ఎంవీఐ రాములు అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, జూనియర్ కళాశాలలో శుక్రవారం 35వ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగితే నష్టం ఎవరూ పూడ్చలేనిదని, వ్యక్తులను కోల్పోయిన కుటుంబాలు జీవితాంతం ఇబ్బందులు పడడంతో పాటు క్షతగాత్రులైన వారు తమ శేష జీవితం దుర్భరంగా గడపాల్సి వస్తుందన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ కరీమున్నీసా మాట్లాడుతూ తమ సిబ్బందికి తగు సూచనలు చేస్తూ ప్రమాద రహిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేస్తున్నట్లు తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సహాయక డీఎం ఎంఎఫ్‌లతో పాటు పాఠశాల హెచ్‌ఎం అనంతలక్ష్మి, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు మధుసూదన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ డీఎం కరీమున్నీసా, ఎంవీఐ రాములు

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

మర్రిపాడు: రోడ్డుపై నడిచి వెళ్తున్న వ్యక్తిని తప్పించబోయి బైక్ అదుపు తప్పి పడిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. నందవరం గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్, సయ్యద్ ద్విచక్ర వాహనంలో డీసీపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా చెక్‌పోస్టు సమీపంలో రోడ్డుపై నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పింది. బైక్‌పై ప్రయాణిస్తున్న షేక్ ఇస్మాయిల్, సయ్యద్ కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇస్మాయిల్‌కు గాయాలు కాగా హైవే అంబులెన్స్ సిబ్బంది ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన ఇస్మాయిల్

కోలాహలంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

కొండాపురం: కొండాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 23వ వార్షికోత్సవాన్ని శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీహరిరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఇష్టంగా కష్టపడి చదివితే మంచి ఉత్తీర్ణత సాధించగలరని తెలిపారు. పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తామన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థినులు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఆత్మకూరు: పట్టణంలో దోమల వ్యాప్తి ఎక్కువ కావడంతో పలువురు కౌన్సిలర్లతో పాటు ప్రజలు ఫిర్యాదులు చేయడంతో కమిషనర్ షేక్ ఫజులుల్లా పలు వార్డుల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేయిస్తున్నారు. మురుగు కాలువల్లో సజావుగా మురుగునీరు పోయేందుకు అడ్డుగా ఉన్న చెత్తను తొలగించడంతో పాటు దోమలు వ్యాప్తి చెందకుండా మందులు పిచికారీ చేయించారు. సాయంత్రం వేళల్లో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాల ద్వారా వీధుల్లో దోమల నివారణకు పొగ మందును స్ప్రే చేయిస్తున్నారు. కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయనున్నట్లు కమిషనర్ ఫజులుల్లా తెలిపారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

చేజర్ల: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన పల్లెకు పోదాం కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీజేపీ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని ఓబులాయపల్లి, పాతపాడు గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించి నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంకు బాలయ్య, సన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

97.7 శాతం మందికి మాత్రల పంపిణీ

ఉదయగిరి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, విద్యార్థులు 97.7 శాతం మందికి వైద్య ఆరోగ్య సిబ్బంది ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించినట్లు మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పన తెలిపారు. పట్టణంలోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించి మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరావు, ఆరోగ్య విద్యాధికారి వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు శుక్రవారం డీవార్మింగ్ మాత్రలను మింగించారు. వైద్యాధికారిణి గీతారెడ్డి మాట్లాడుతూ మండలంలో 8,517 మందికి డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, ఈఓపీఆర్డీ వెలుగోటి మధు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలో 96 శాతం మందికి వైద్య ఆరోగ్య సిబ్బంది ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించినట్లు మండల వైద్యాధికారిణి కరిష్మా తెలిపారు. ఆమె శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ శ్రీదేవి, ఎంఈఓ షావుద్దీన్‌తో కలిసి విద్యార్థులకు మాత్రలు మింగించారు. మండలంలో 3,601 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు.



ఉదయగిరి: విద్యార్థులకు మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారిణి శివకల్పన

ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దుత్తలూరు: మండలంలోని దుత్తలూరు పీహెచ్‌సీ పరిధిలో విద్యార్థులకు శుక్రవారం ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారి అయూబ్ అఫ్సర్ విద్యార్థులకు మాత్రలు మింగించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఆల్‌బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా మింగాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఓంకారయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు ఖాజామొహిద్దీన్, అరుణకుమారి, హెల్త్ అసిస్టెంట్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో నులి పురుగుల మాత్రలను మింగించారు. చిత్తలూరు పీహెచ్‌సీ పరిధిలో కూడా ఈకార్యక్రమాన్ని చేపట్టారు. కోటితీర్థం ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా పిల్లలకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వైద్యులు మెహతాబ్, జ్యోతి, నవీన్, సీహెచ్‌ఓ చంద్రయ్య పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలను పంపిణీ చేశారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఏఎస్‌పేట ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మంజుల, డాక్టర్ జ్యోతి రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంగం: మండలంలోని మర్రిపాడు ప్రాథమిక పాఠశాలలో మండల వైద్యాధికారి బీ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలో 62 పాఠశాలలు, 3 జూనియర్ కళాశాలలు, 52 అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 7,847 మందికి 7,274 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ సీహెచ్ మల్లెం కొండయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఏఎస్‌పేట: కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ పద్మజారెడ్డి

మర్రిపాడు: మండలంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డాక్టర్ గోపినాథ్, డాక్టర్ వంశీ ఆధ్వర్యంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రిన్సిపల్ శ్రీనివాసరావు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. డాక్టర్ గోపినాథ్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఆరు నెలలకు ఒక మాత్ర తీసుకోవాలని సూచించారు. దీని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి జావీద్ ఉన్నారు.

సోమశిల: అనంతసాగరం ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో, ప్రైవేట్ పాఠశాలలో 5,000 మంది పైగా విద్యార్థులకు నులి పురుగుల మందులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ తాజ్ మస్రూర్, హెచ్‌ఎం బట్రెడ్డి లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

12న డయల్ యువర్ డీఎం

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 12న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని అన్ని మండలాల ప్రయాణికులు డిపో అభివృద్ధికి, ఆర్టీసీ అందిస్తున్న సేవలపై తమ సూచనలు, సలహాలు ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 99592 25095 నంబరులో తెలియజేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అల్లూరు: విద్యుత్ మరమ్మతుల కారణంగా రెండో శనివారం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అల్లూరు టౌన్ ఏఈ షేక్ మస్తాన్ తెలియజేశారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

సొసైటీ రికార్డుల కంప్యూటరీకరణ

దుత్తలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సాయంతో త్వరలో సొసైటీల రికార్డులు కంప్యూటరీకరణ చేయడం జరుగుతుందని కమ్మవారిపాళెం సొసైటీ సీఈఓ సీహెచ్ లోకనాథ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీలో రూ.300 పైన షేర్ ధనం కలిగిన సభ్యులు వారి ఆధార్, రేషన్‌కార్డు, పొలం పత్రం, బ్యాంకు అకౌంట్, తదితర జెరాక్స్ కాపీలు ఈ నెల 15వ తేదీలోపు సొసైటీ కార్యాలయంలో అందజేయాలన్నారు.